క్లుప్తంగా

ఖాతాదారులకు మెరుగైన సేవలు



అల్లూరు: తమ బ్యాంకు ద్వారా ఖాతాదారులకు మెరుగైన సేవలను అందజేస్తున్నామని పంజాబ్ నేషనల్ బ్యాంకు అల్లూరు శాఖ మేనేజర్ దర్శన్‌కుమార్ తెలిపారు. అల్లూరు శాఖ రెండు వసంతాలను పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. మేనేజర్ కేక్ కట్ చేసి ఖాతాదారులు, బ్యాంకు సిబ్బందికి పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు సేవలపై ఖాతాదారులకు అవగాహన కల్పించారు.

కమిషనర్‌కు అభినందనలు



కావలి: మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌ను కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు బుధవారం అభినందించారు. పట్టణంలోని చిరువ్యాపారులకు రుణాల మంజూరులో చొరవచూపి రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ చేతుల మీదుగా పురస్కారం అందుకోవడంపై కమిషనర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

3 నుంచి నైపుణ్య గణన

ఆత్మకూరురూరల్/ఉదయగిరి: వచ్చే నెల 3 నుంచి నైపుణ్య గణన కార్యక్రమం చేపడుతున్నట్లు ఆత్మకూరు, ఉదయగిరి ఎంపీడీఓలు ఐజాక్ ప్రవీణ్,శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం వారు మండల పరిషత్ కార్యాలయాల్లో నైపుణ్య గణనపై పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. వివిధ వృత్తుల్లో ప్రావీణ్యం కలిగిన 16 నుంచి 59 ఏళ్లలోపు వయస్సు వారిని గుర్తించి యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. వారికి ఆయా అంశాల్లో ప్రభుత్వం శిక్షణ ఇవ్వడంతో పాటు ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. మాస్టర్ ట్రెయినీలు వినయ్, రాజేష్ మాట్లాడుతూ నైపుణ్యగణన సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

రీ సర్వే సమస్యలు పరిష్కరిస్తాం

ఆత్మకూరు(చేజర్ల): రీ సర్వేకు సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని చేజర్ల మండల డిప్యూటీ తహసీల్దార్ మస్తానయ్య తెలిపారు. చేజర్ల మండలం గొల్లపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సును బుధవారం నిర్వహించారు. పలువురు రైతులు సమస్యలపై అర్జీలు అందజేశారు. ప్రాధాన్యత క్రమంలో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని డీటీ తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్ఐ వెంకటేశ్వర్లు, వీఆర్ఓ మల్లికార్జున, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి



జాలమ్మ (ఫైల్)

కావలి: బంధువు దాడిలో రెండు రోజుల క్రితం తీవ్రంగా గాయపడిన ఓ మహిళ బుధవారం మృతి చెందింది. కావలి రూరల్ సీఐ రాజేశ్వరరావు వివరాల మేరకు.. కావలి మండలం పెద్దపట్టుపుపాళెం పంచాయతీలోని నందెమ్మపురంలో కాటంగారి జాలమ్మ (53) నివాసం ఉంటోంది. ఆమె వద్దే కుమారుడు బాబు ఉంటున్నాడు. అతని పెద్ద కుమారె, అల్లుడు ఆవుల మునెయ్య కూడా వీరితో పాటే ఉంటున్నారు. ఈ నెల 27వ తేదీ రాత్రి ఏం జరిగిందో కానీ జాలమ్మను మునెయ్య కర్రతో విచక్షణారహితంగా కొట్టి పారిపోయాడు. ఆమెను తొలుత కావలి, ఆ తరువాత నెల్లూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బుధవారం మెరుగైన వైద్యం కోసం తిరుపతిలోని రుయా ఆస్పత్రికి తీసుకెళ్తుండగా దారిలో మరణించింది. బాబు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థులకు ఆర్‌డీ పథకం

ఆత్మకూరు: జిల్లా కేంద్ర సహకార బ్యాంకు విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం ఆర్‌డీ పథకాన్ని తీసుకొచ్చిందని ఎన్‌డీసీసీబీ ఆత్మకూరు శాఖ సీనియర్ మేనేజర్ శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం ఆయన ఫీల్డ్‌ఆఫీసర్ ఎం జనార్దన్‌రెడ్డితో కలిసి విలేకరులతో మాట్లాడా రు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు నెలకు రూ.వేయి చొప్పున ఐదేళ్ల పాటు రూ.60 వేలు ఆర్డీ చేస్తే రూ.3 లక్షల రుణాన్ని సెక్యూరిటీ లేకుండా ఉన్నత చదువుల కోసం మంజూరు చేయనున్నట్లు వివరించారు. వివరాల కోసం 99515 30054 నంబరులో సంప్రదించాలని సూచించారు.

ఉపాధి పనులపై సమీక్ష

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ ఉపాధిహామీ పనులపై ఉపాధి సిబ్బందితో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పండ్ల తోటల సాగుపై దృష్టి పెట్టి నిర్దేశిత లక్ష్యాలను పూర్తిచేయాలన్నారు. ఏపీఎం ఆజాం ఖాన్ పాల్గొన్నారు.

3న ఉచిత వైద్యశిబిరం

సీతారామపురం: స్థానిక ఎల్‌వీఆర్ జూనియర్ కళాశాలలో వచ్చే నెల 3న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు 2002–2004 బ్యాచ్ పూర్వ విద్యార్థులు బుధవారం తెలిపారు. నెల్లూరు ఎనెల్ ఆస్పత్రి వైద్యులు గుండె సంబంధిత వ్యాధులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేస్తారని చెప్పారు. మండల ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చీకటి వెలుగుల దీపావళి

- మండుతున్న బాణసంచా ధరలు
- పూజాసామగ్రి ధరలకు రెక్కలు
- ఆకాశన్నంటుతున్న నిత్యావసర సరుకులు
- నెలాఖరు కావడంతో ఖర్చుపై ప్రభావం
- భారంగా పండగకు సిద్ధమైన ప్రజలు



ఆత్మకూరులోని టపాసుల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి



ఆత్మకూరులోని పూల దుకాణాల వద్ద కొనుగోలుదారుల సందడి

ఉదయగిరి/ఆత్మకూరు/సీతారామపురం: దీపావళి..చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక. వెలుగుల పండగకు ఉదయగిరి, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాల్లోని మార్కెట్లు సిద్ధమయ్యాయి. పూజాసామగ్రి, బాణసంచా, నిత్యావసర సరుకుల కొనుగోలుదారులతో మార్కెట్లు సందడిగా మారాయి. అయితే పూలు, పూజసామగ్రి, బాణసంచా ధరలు మండుతుండడం.. నెలాఖరు కావడం...గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రతి నెలా సంక్షేమ పథకాల నగదు కూటమి ప్రభుత్వంలో అందకపోవడంతో ఈ ఏడాది దీపావళిని కొంతభారంగా జరుపుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు. ఉదయగిరి, కావలి, ఆత్మకూరు నియోజకవర్గాల ప్రజలు గురువారం దీపావళిని జరుపుకొనేందుకు సిద్ధమయ్యారు. వివిధ రకాల టపాసులు, ప్రమిదలు, సీరియల్ లైటింగులు, లక్ష్మీదేవి పూజకు పూలు కొనుగోలు చేసే వారితో దుకాణాల వద్ద బుధవారం సందడి నెలకొంది. అయితే అన్నింటి ధరలు మండుతుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు.

పేలుతున్న టపాసుల ధరలు

కావలి, ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో మంగళవారం నుంచే టపాసుల విక్రయాలు మొదలయ్యాయి. కొన్నిచోట్ల ప్రత్యేక దుకాణాలు ఏర్పాటు చేశారు. బుధవారం సాయంత్రం నుంచి అమ్మకాలు ఊపందుకున్నాయి. గతేడాది దీపావళికి తుఫాన్ హెచ్చరికలతో టపాసులు అమ్ముడుపోక వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండడంతో ఆ లోటును భర్తీ చేసుకునేందుకు వ్యాపారులు సిద్ధమయ్యారు. ఈ ఏడాది బాణసంచా ధరలు తీవ్రంగా పెరిగినా పిల్లల కోసం కొనుగోలు చేయక తప్పడం లేదని కొనుగోలుదారులు వాపోతున్నారు. వ్యాపారులు ఎంత గొప్పగా అఫర్లు ఇచ్చినా గతేడాది రెండు, మూడు వేల రూపాయలకు వచ్చిన సామగ్రి ఈ ఏడాది ఐదారు వేల రూపాయలు పెడితేగాని రావడం లేదని పలువురు వాపోతున్నారు. రెండు వేలు వాలా రూ.1,500, ఐదు వేలు వాలా రూ.3 వేలు, పది వేలు వాలా రూ.5 వేలు, గిఫ్ట్‌ప్యాకెట్లు రూ.1,000–రూ.1,500 వరకు ధరల మోత మోగుతున్నాయి. దీనికి తోడు నిత్యావసర సరుకులు కూడా అదే రీతితో మండుతున్నాయి. దీనికితోడు ఈ ఏడాది దీపావళి పండగ నెల చివర్లో రావడంతో చీకటి వెలుగులు నడుమ పండగను జరుపుకోవాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు.

కొనకుండానే పేలుతున్నాయి



ఇంటిల్లిపాది సంతోషంగా జరుపుకొనే పండగ దీపావళి. సాయంత్రం టపాసుల మోతతో సందడే సందడి. ఈ ఏడాది టపాసులు కొనకుండానే పేలుతున్నాయి. నిత్యావసర ధరలు కూడా మండుతున్నాయి. రానున్న రోజుల్లో మధ్యతరగతి ప్రజలు పండగలు జరుపుకునే పరిస్థితి లేదు.

– సురేష్, జనార్దనాపురం

అప్రమత్తంగా ఉండాలి

దీపావళి పండగను ప్రజలు సంతోషంగా జరుపుకోవాలి. నిబంధనల మేరకు ఏర్పాటైనా దుకాణాలకు మాత్రమే అనుమతులు ఇచ్చాం. ప్రతి దుకాణం వద్ద ఖచ్చితంగా నీరు, ఇసుక పెట్టుకోవాలి.ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం. ప్రజలు అప్రమత్తంగా ఉండి బాణసంచా కాల్చాలి.

– ఎస్ వెంకట్రావు, సీఐ ,ఉదయగిరి

దీపావళి శుభాకాంక్షలు

ఆత్మకూరు/ ఉదయగిరి: దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాల ప్రజలకు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి బుధవారం వేర్వేరు ప్రకటనల్లో శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణహిత దీపావళిని ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని, లక్ష్మీదేవి కటాక్షం ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు.

ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ



ఆత్మకూరురూరల్: ముస్తాపురంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు బుధవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ప్రకృతి వ్యవసాయ కార్యాలయం అధికారులు రవిచంద్రప్రసాద్, మునిరాజ్ ప్రకృతి వ్యవసాయంలో ఘన, ద్రవ జీవామృతం, కషాయాల వినియోగంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయాధికారులు వేణుగోపాల్, మల్లికార్జున, మెంటార్లు సుబ్బమ్మ, విజయకుమారి, కృష్ణవేణి, ఎఫ్ఎస్ కల్పన, శ్రావణి, నాగభూషణమ్మ పాల్గొన్నారు.

నారుమళ్లకు సాగునీరు విడుదల



సోమశిల ఎస్ఈ వెంకటరమణారెడ్డి

నెల్లూరు (దర్గామిట్ట): ఐఏబీ సమావేశం ఇంకా జరగకపోవడం, జిల్లాలోని రైతాంగం నారుమళ్లు సిద్ధం చేసుకునేందుకు సమయం మించిపోతున్న తరుణంలో కలెక్టర్ ఆదేశాల మేరకు సోమశిల నుంచి బుధవారం నుంచి 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నామని ప్రాజెక్ట్ ఎస్ఈ వెంకటరమణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిలలో నీటి లభ్యత పుష్కలంగా ఉన్న దృష్ట్యా నీటిని విడుదల చేస్తున్నామని, రైతులు సాగునీటిని వాడుకుని పంటలను పండించుకోవాలని కోరారు. జిల్లాలో 5.51 లక్షల ఎకరాల ఆయకట్టుకు ఈ సీజన్‌లో నీరు అవసరం ఉందన్నారు. పెన్నార్ డెల్టా కింద 2,47,000 ఎకరాలు, కనుపూరు కాలువ కింద 66 వేల ఎకరాలు, కావలి కాలువ కింద 1,24,000 ఎకరాలు, నార్త్ ఫీడర్ చానల్ కింద 72,000 ఎకరాలు, సౌత్ ఫీడర్ కెనాల్ కింద 42 వేల ఎకరాలు ఆయకట్టుకు సాగునీరు విడుదల చేయాల్సి ఉందని ఎస్ఈ నాయక్ తెలిపారు. కనిగిరి, కనుపూరు, కావలి కాలువలకు ఈ నెల 30వ తేదీ నుంచి రోజుకు 500 క్యూసెక్కుల చొప్పున 20వ తేదీ వరకు, సర్వేపల్లి కాలువకు 20వ తేదీ వరకు 600 క్యూసెక్కులు చొప్పున నీరు విడుదల చేస్తామన్నారు. 5 నుంచి 19వ తేదీ వరకు జీకేఎన్ కాలువకు 500 క్యూసెక్కులు, సౌత్‌ఫీడర్ చానల్‌కు 300 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తామని తెలిపారు. కండలేరు నుంచి కేఆర్ లెఫ్ట్ కెనాల్‌కు 120 క్యూసెక్కులు, మనుబోలు సిస్టం ట్యాంక్ స్లుయిస్ ద్వారా 200 క్యూసెక్కులు, ఫస్ట్ బ్రాంచ్ కెనాల్‌కు 75 క్యూసెక్కులు, ఎస్ఎస్‌జీ కెనాల్స్‌కు 2ఏ, 2బి, 3, 4, 5, 5ఏ, 6, 7, 8ఏ తదితర వాటికి 950 క్యూసెక్కులు, చెన్నై తాగునీటి అవసరాలకు 950 క్యూసెక్కులు, తిరుపతి, శ్రీకాళహస్తి ఏర్పేడుకు 100 క్యూసెక్కుల చొప్పున ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 13వ తేదీ వరకు నీరు విడుదల చేస్తామని ఎస్ ఈ వెంకటరమణారెడ్డి తెలిపారు.

2న గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలు



ఆత్మకూరు: దివంగత మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతి వేడుకలను నవంబరు 2న ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కార్యాలయంలో బుధవారం వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో 2న ఉదయం 10 గంటలకు బ్రాహ్మణపల్లిలో వేడుకలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆత్మకూరులోని ఎంజీఆర్ మెమోరియల్ మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని గౌతమ్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మేకపాటి అభిమానులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, మున్సిపల్ కౌన్సిలర్లు షేక్ మహబూబ్‌బాషా, సీహెచ్ కామాక్షయ్య నాయుడు, మొలబంటి రాజశేఖర్, నాయకులు ఎన్ వినయ్‌కుమార్ రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, షేక్ రిజ్వాన్, ఉల్సా పెంచలయ్య, ఎన్ ప్రసాద్, బాల అంకయ్య, కిషోర్, జమ్రు, చెన్నకేశవులు, ఎన్ ప్రసాద్, అశోక్, వెంకట రమణ, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



మర్రిపాడు: సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై శ్రీనివాసరావు



సంగం: రక్తదానం చేస్తున్న పోలీసులు

సంగం: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఆత్మకూరు డీఎస్పీ వేణుగోపాల్ పేర్కొన్నారు. పోలీసు అమర వీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా సంగం పోలీసు స్టేషన్‌లో సీఐ వేమారెడ్డి, ఎస్సై రాజేష్ ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని నోవా బ్లడ్ బ్యాంక్ చైర్మన్ భాస్కర్‌నాయుడుతో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. సీఐ, ఎస్సై, పలువురు యువకులు, స్థానికులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదానం చేసిన యువకులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఏఎస్‌పేట, చేజర్ల ఎస్సైలు సైదులు, ప్రభాకర్, టీడీపీ నాయకులు పట్టాభి, షేక్ బాబు, జనసేన నాయకులు భాస్కర్, అనిల్, ప్రైవేట్ కళాశాల కరస్పాండెంట్ బాషా పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన

మర్రిపాడు : పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మర్రిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు సైబర్ నేరాలపై ఎస్సై శ్రీనివాసరావు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన పెంచుకుని చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేయాలని సూచించారు. అనంతరం సైబర్ నేరాలపై వ్యాసరచన పోటీలను నిర్వహించారు.

నేడు విద్యుత్ బిల్లులు చెల్లించొచ్చు

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లో ఉన్న విద్యుత్ రెగ్యులర్ రెవెన్యూ కలెక్షన్ ఆఫీసులో (కరెంట్ ఆఫీస్) గురువారం ఉదయం 10 గంటల నుంచి 5 గంటల వరకు కరెంట్ బిల్లులు చెల్లింపునకు అవకాశం కల్పించినట్లు పట్టణ విద్యుత్ శాఖ ఏఈవై వసంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీపావళి పండగ సందర్భంగా ఆఫీసుకు సెలవు దినమైనప్పటికీ వినియోగదారుల సౌకర్యార్థంగా బిల్లులు చెల్లింపులకు అవకాశం కల్పించినట్లు వివరించారు.

రెడ్‌క్రాస్ ఉద్యమానికి హెన్రీ డ్యూనాంట్ నాంది



హెన్నీడ్యూనాంట్‌కు నివాళులర్పిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

కావలి: రెడ్‌క్రాస్ వ్యవస్థాపకులు జీన్ హెన్రీడ్యూనాంట్ వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో బుధవారం నిర్వహించారు. హెన్రీ చిత్రపటానికి రెడ్‌క్రాస్ ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బ్లడ్‌బ్యాంకు కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ మాట్లాడుతూ 1863లో రెడ్‌క్రాస్ ఉద్యమానికి హెన్రీ నాంది పలికారని తెలిపారు. యుద్ధంలో గాయపడిన సైనికులకు వైద్యసేవలు అందించడానికి ప్రారంభించిన రెడ్‌క్రాస్ నేడు విశ్వవ్యాప్తంగా అతిపెద్ద మానవతా ఉద్యమంగా రూపుదిద్దుకుందని వివరించారు. 1901లో తొలి నోబెల్ శాంతి బహుమతి అందుకున్నారని వివరించారు. గత 25 ఏళ్లుగా కావలి రెడ్‌క్రాస్ నిర్వహించిన సేవా కార్యక్రమాలు రాష్ట్ర, జాతీయ స్థాయిలో గుర్తింపు పొందాయని తెలిపారు. రెడ్‌క్రాస్ ప్రతినిధులు కే హరినారపరెడ్డి, కలికి సాయికుమార్‌రెడ్డి, ఐ రాజశేఖర్, రక్తనిధి సిబ్బంది నివాళులు అర్పించారు.

కలిగిరిలో ఓ మోస్తరు వర్షం



కలిగిరి: మండల కేంద్రమైన కలిగిరిలో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మధ్యాహ్నం వేళ ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. కలిగిరిలో తప్ప చుట్టుపక్కల గ్రామాల్లో వర్షం పడలేదు. అకస్మాత్తుగా కురిసిన వర్షంతో టపాసుల దుకాణాల నిర్వాహకులతో పాటు ఇతర వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు.

మత్స్యకారులకు సబ్సిడీపై రుణాలు



మాట్లాడుతున్న మత్స్యశాఖ జేడీ నాగేశ్వరరావు

కావలి: మత్స్యకారులు అన్ని రంగాల్లో ఆర్థికంగా అభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో బ్యాంకుల ద్వారా సబ్సిడీపై రుణాల మంజూరుకు కృషి చేస్తున్నట్లు మత్స్యశాఖ జిల్లా జాయింట్ డైరెక్టర్ ఎం నాగేశ్వరరావు తెలిపారు. కావలి మండల పరిషత్ కార్యాలయంలో లీడ్ బ్యాంకు మేనేజర్ టీఎస్ ప్రదీప్‌కుమార్, ఇతర బ్యాంకుల సిబ్బందితో కలిసి మత్స్యకారులతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ మత్స్యకారులకు బోట్ల కొనుగోలుకు బ్యాంకుల ద్వారా రుణాల మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఒక్కో యూనిట్ విలువ రూ.1.20 కోట్లు కాగా, వ్యక్తిగతంగా లేదా నలుగురు అంతకన్నా ఎక్కువ మంది గ్రూపుగా ఏర్పడి పొందవచ్చని వివరించారు. మత్స్యశాఖ కావలి ఏడీ ఎస్ శ్రీనివాసులు, ఎఫ్‌డీఓ లక్ష్మణ్‌నాయక్, మత్స్యకారులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై సమీక్ష

కావలి: కావలి ఆర్డీఓ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్ బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కావలి ఆర్డీవో ఎం. వంశీకృష్ణ, డివిజన్ పరిధిలోని పది మంది తహసీల్దార్లు , మండల సర్వేయర్లతో భూ సమస్యలపై చర్చించారు. ప్రజలు అందజేసిన అర్జీలకు పరిష్కారం చూపాలని ఆదేశించారు. పరిశ్రమల ఏర్పాటు, ఇతర ప్రభుత్వ అవసరాలకు ఆమోద యోగ్యమైన భూమిని గుర్తించాలని సూచించారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతి

బోగోలు మండలంలో రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతూ దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి జాయింట్ కలెక్టర్ కార్తీక్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఎస్సీ, ఎస్టీ కాలనీల చుట్టూ వెంచర్లు వేసి దారులు లేకుండా చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇబ్బందులు పెడుతున్నారని చెప్పారు. వారికి రెవెన్యూ యంత్రాంగం కూడా కొమ్ము కాస్తోందని ఆరోపించారు. కోవూరుపల్లి చెరువులోని ఏడెకరాల భూమిని ఆక్రమించినా అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదని విన్నవించారు.

ముందస్తు దీపావళి వేడుకలు



సీతారామపురం: వేదగర్భ స్కూల్‌లో..



చేజర్ల మండలం ఏటూరు ఎంపీపీ పాఠశాలలో..



వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో..

ఆత్మకూరు(చేజర్ల): చేజర్ల మండలం ఏటూరు ఎంపీపీ పాఠశాలలో ముందస్తుగా దీపావళి వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు దీపాలను వెలిగించి బాణసంచా కాల్చారు. హెచ్ఎం దీపావళి పండగ విశిష్టతను వివరించారు.

అనుమసముద్రంపేట: స్థానిక ఠాగూర్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి ముందస్తు దీపావళి సంబరాలను జరుపుకొన్నారు. విద్యార్థులు రంగవల్లులు వేసి దీపాలను వెలిగించి వివిధ రకాల టపాసులు కాల్చారు. నరకాసురుడి బొమ్మను దహనం చేశారు. హెచ్ఎం కే దొరస్వామిరెడ్డి, కరస్పాండెంట్ వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక వేదగర్భ పాఠశాలలో ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలుత ధనలక్ష్మీదేవి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు దీపాలను వెలిగించి బాణసంచా కాల్చారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వింజమూరు(ఉదయగిరి) : ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు, ఉదయగిరి మండలాల్లో దీపావళి వేడుకలు బుధవారం ప్రారంభమయ్యాయి. నరక చతుర్దశి సందర్భంగా పట్టణ ప్రాంతాల్లో బాణసంచా పేల్చి వేడుకలు ప్రారంభించారు. వింజమూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో దీపాలు వెలిగించి పండగను జరుపుకొన్నారు.

బాణసంచా దుకాణాల తనిఖీ

సంగం: సంగంలో ఏర్పాటు చేసిన దీపావళి బాణసంచా దుకాణాలను సీఐ వేమారెడ్డి, తహసీల్దార్ సంధ్య, ఎస్సై రాజేష్ బుధవారం పరిశీలించారు. లైసెన్స్‌లను తనిఖీ చేసి భద్రతా చర్యలను పరిశీలించారు. లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు.

సీతారామపురం: స్థానిక ఆర్టీసీ బస్‌షెల్టర్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను తహసీల్దార్ వెంకటకృష్ణారెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డితో కలిసి పరిశీలించారు. లైసెన్స్‌లను తనిఖీ చేసి అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటించాలని సూచించారు. దుకాణాలను దూరందూరంగా ఏర్పాటు చేసుకోవాలని, ప్రతి షాపు వద్ద నీళ్లు, ఇసుక సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

జేసీబీ అపహరణ

అల్లూరు: జేసీబీని దొంగలు అపహరించుకెళ్లిన ఘటన అల్లూరులో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బాధితుడి ఫిర్యాదు మేరకు ..బండ్ల మోషేష్ తన జేసీబీను రోజూలాగే పోలీసు క్వార్టర్స్ సమీపంలో మంగళవారం రాత్రి పార్కింగ్ చేశాడు. బుధవారం ఉదయం వచ్చి చూడగా కనిపించలేదు. దీంతో అల్లూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

కావలిలో మంత్రి ఆనం

కావలి: స్థానిక ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి ఆహ్వానం మేరకు పట్టణంలోని భారీ జాతీయ జెండా, జాతీయ, స్థానిక నాయకుల చిత్రాలతో కూడిన ప్రదేశాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి బుధవారం సందర్శించారు. తొలుత మంత్రిని ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు.

పోలీసులకు మాజీ ఎమ్మెల్యే అభినందనలు

కావలి: పట్టణంలోని వెంగళరావునగర్‌లో అపహరణకు గురైన చిన్నారిని క్షేమంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చిన కావలి పోలీసు అధికారులకు మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. కావలి ప్రజలకు మెరుగైన శాంతిభద్రతలను అందించే దిశగా పోలీసు ఉన్నతాధికారులు మరింత కృషి చేయాలి కోరారు.

నేడు కావలి కాలువకు సోమశిల జలాలు విడుదల

కావలి: కావలి, ఉదయగిరి నియోజకవర్గాలకు సాగు నీరు అందించే కావలి కాలువకు గురువారం సోమశిల జలాలను విడుదల చేస్తున్నట్లు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి తెలిపారు. కావలిలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతానికి భిన్నంగా రెండు నెలల ముందే కావలి కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు చెప్పారు. కావలి నియోజకవర్గంలోప్రతి ఎకరాకు సాగు నీరు అందించే బాధ్యతను వ్యక్తిగతంగా తాను తీసుకుంటానని, రైతులు నిర్భయంగా పంటలు సాగు చేసుకోవాలని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు.

విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు

ఆత్మకూరు: పట్టణంలోని రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారిణి అస్మా బుధవారం సందర్శించారు. విద్యార్థినులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు.





